క్లుప్తంగా

ఘనంగా గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఆర్‌ఎఫ్‌సీఎఫ్ టౌన్‌షిప్‌లోని శ్రీఅయ్యప్ప దేవాలయంలో గురువారం మండల పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆలయ ప్రధాన గురుస్వామి కర్నే అశోక్‌శర్మ అయ్యప్ప, గణపతి, నాగరాజు, మాలికపూరం, సుబ్రమణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, గజారోహణం, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన గురుస్వామి ఆడెపు లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

అయ్యప్ప రథయాత్ర నిర్వహణకు విరాళం



చెక్కు అందజేస్తున్న భక్తుడు రాజనర్సయ్య

రామగుండం: ఏటా జనవరి ఒకటో తేదీన పట్టణంలో అయ్యప్ప రథయాత్ర నిర్వహిస్తామని ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్‌శర్మ, గురుస్వామి గోపగాని రాములుగౌడ్ తెలిపారు. రథయాత్ర నిర్వహణకు రామగుండంకు చెందిన భక్తుడు ఇరికిళ్ల రాజనర్సయ్య–స్నేహలత దంపతులు రూ.50వేల విలువైన చెక్కు అందజేశారు.

రోడ్డుభద్రత నియమాలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై రమేశ్

ఓదెల: డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపొద్దని పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేశ్ అన్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల గ్రామంలో గురువారం ఎస్సై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డుభద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపొద్దన్నారు.

సభ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి అశోక్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీలో గురువారం నాయకులతో కలిసి 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రెండు పార్టీల విలీన సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. లింగయ్య, రాజేశ్వరి, మధునమ్మ, స్వామి, రాయమల్లు, లక్ష్మి, రజిత, కాంతమ్మ పాల్గొన్నారు.

మడేలయ్య ఆలయ సింహద్వార ప్రతిష్ఠాపన

జూలపల్లి: మండల కేంద్రంలోని రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మడేలయ్య ఆలయ సింహద్వారానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, నేనున్నా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ ప్రతిష్ఠాపన చేశారు.

పేద యువతి పెళ్లికి సాయం..

మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద అమరగాని శ్రీను, స్వరూప దంపతుల కూతురు రవళి వివాహానికి హాజరై నూతన వధూవరులను దీవించి రూ.5వేలు అందజేశారు. జూలపల్లిలో సంఘం నాయకులు శంకరయ్య, నారాయణ, గంగిపెల్లి భూమయ్య, రవీందర్, పెద్దాపూర్‌లో తొగరు శ్రీనివాస్, గడ్డమీది శ్రీను, పూరెల్ల గంగయ్య, సంకెన్ల లక్ష్మన్ పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు ఇబ్రహీం ఎంపిక

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని జనగామ గ్రామానికి చెందిన ఇన్కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండీ ఇబ్రహీం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైనట్లు అంబేడ్కర్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ మనీష్ గవాయి, ప్రియాంక సాతే తెలిపారు.

అంతర్గత రహదారులకు మోక్షం

- సీసీరోడ్లు, డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణానికి పాలకవర్గం కసరత్తు
- చకచకా సాగుతున్న పనులు



సుల్తానాబాద్‌లో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్‌లో పలు రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ రోడ్ల పరిస్థితి అలాగే ఉండడంతో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులను ఇటీవల ప్రారంభించారు. పనులు జోరందుకున్నాయి. సీసీ రోడ్లతోపాటు డ్రైనేజీల నిర్మాణం చకచకా సాగుతున్నారు.

రోడ్లకు మహర్దశ..

పట్టణంలోని ఊర చెరువు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు సీసీరోడ్డుతో పాటు డ్రైనేజీ, సుగ్లాంపల్లి, పట్టణంలోని జవహర్‌నగర్, పూసాల చెరువు వరకు రోడ్డు, కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా నుంచి శాంతినగర్ వెళ్లే రహదారి వరకు రూ.5కోట్లతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఏడాదిలోనే అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నారు. చెరువు నుంచి ఎంపీడీవో వరకు రహదారికి రూ.8లక్షలు, డ్రైనేజీకి రూ.31లక్షలు, పూసాల చెరువు వరకు రోడ్డుకు రూ.2కోట్లు, డ్రైనేజీలకు రూ.54లక్షలు, సుల్తానాబాద్ నుంచి గట్టెపల్లి వరకు వెళ్లే రహదారికి రూ.2కోట్ల50లక్షలు, సుల్తానాబాద్ నుంచి నీరుకుల్ల వరకు రూ.6కోట్ల నిధులు మంజూరయ్యాయి.

ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి

మున్సిపల్ అభివృద్ధి కోసం ఇటీవల అధికారులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు వేగవంతం చేయడంతో పాటు నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల సౌకర్యార్థం పనులు జరపాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు.

పనులు వేగంగా జరుగుతున్నాయి



సుల్తానాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఎమ్మెల్యే విజయరమణారావు నిధులు మంజూరు చేశారు. రూ.6 కోట్లతో వివిధ ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. భవిష్యత్ తరాల అవసరాల కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతతో పాటించాలి.

– లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, సుల్తానాబాద్



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ రాజీవ్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పూర్తిస్థాయి సర్వీసు రోడ్డు లేకపోవడం, ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌కు, ఎఫ్‌సీఐ ప్లాంట్‌కు వెళ్లే దారి కావడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. సిగ్నల్స్ ఉన్నా కూడా వాహనదారులు సర్వీసు రోడ్డు నుంచి వచ్చే వారు నేరుగా మెయిన్ రోడ్డుకు వచ్చే సరికి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్డుపై వాహనదారులు గజిబిజిగా వెళ్లడంతో రోడ్డు దాటాలంటే ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత విభాగం అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించే ఏర్పాట్లు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

బాధిత కుటుంబానికి వాకర్స్ చేయూత



నగదు అందజేస్తున్న వాకర్స్ సభ్యులు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన కొయ్యడ భాను చికిత్స కోసం వారి కుటుంబ సభ్యులకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.30వేలు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం వాకింగ్ చేసిన అనంతరం నగదు అందజేశారు. ఇటీవల భాను కరీంనగర్‌లో పరీక్ష రాసేందుకు వెళ్తుండగా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లిలో ప్రమాదం జరిగింది. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గమనించిన వాకర్స్ వారికి అండగా నిలిచారు. వైద్య ఖర్చులకోసం దాదాపు రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వాకర్స్ సభ్యులు కోరారు. వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బైరగోని రవీందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్, కార్యదర్శి మంద శ్రీనివాస్, సభ్యులు కందుకూరి ప్రకాశ్‌రావు, చొప్పరి సుమన్, కొమురవెల్లి భాస్కర్, దూడం లింగమూర్తి, పెగడ పరశురాం, పల్ల సురేశ్, అమిరిశెట్టి తిరుపతి, పల్లా శ్రీనివాస్, వల్లాల రాజు, కొమురవెల్లి శ్రీనివాస్, సిద్ధ తిరుపతి, దర్శనాల రామచందర్, నాగమల్ల ప్రశాంత్, వేణు, శ్రీనివాస్, కందుకూరి కుమార్, కొలిపాక రవీందర్, యూసుఫ్, కొమురవెల్లి ప్రభాకర్, నిట్టూరు శ్రీనివాస్, పురం రమణ, ఇల్లందుల మల్లేశం పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యం

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షిస్తూనే సమరశీల ఉద్యమాలకు సన్నద్ధమవుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం సీపీఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీపీఐ పతాకం ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(సీపీఐ) వందేళ్ల చరిత్రలో కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ తదితర రంగాల్లోనివారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు పన్నుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, మానస్‌కుమార్, ఉదయ్, అంజి, శంకర్, ఓదెలు, నవీన్, లక్ష్మణ్, శంకర్, సదానందం, రవి, రమేశ్ పాల్గొన్నారు.

భాస్కర్‌రావు భవన్‌లో వేడుకలు..

గోదావరిఖని: సీపీఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవాలను స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. భాస్కర్‌రావుభవన్, ప్రధాన చౌరస్తాలో అరుణ పతాకం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకరాజ్, గోసిక మోహన్, మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఆరెల్లి పోశం, తాళ్లపల్లి మల్లయ్య, ఓదమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లోనూ పార్టీ జెండాలను ఎగురవేసి ఉత్సవాలు ప్రారంభించారు. నాయకులు మాట్లాడుతూ తమ పార్టీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

న్యూఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జూలపల్లి: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇన్‌చార్జి ఎస్సై నరేశ్‌కుమార్ సూచించారు. మండలంలోని కాచాపూర్‌లో గురువారం రాత్రి పంచాయతీ కార్యాలయంలో పోలీస్ కళాబృందం కళాకారులతో నూతన సంవత్సర వేడుకలపై యువతకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ డిసెంబరు 31న ప్రతీ గ్రామంలో తనిఖీలు చేస్తామని, మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్, అధిక వేగం, ఆరుబయట మద్యం సేవించడంపై తనిఖీలు చేస్తామన్నారు. గుంపులుగా ఉండడం, డీజేలు పెట్టడం లాంటివి చేయొద్దన్నారు. ట్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే జరిమానా, శిక్షలు తప్పవని పేర్కొన్నారు. పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మద్యం మత్తులో కత్తితో దాడి

జ్యోతినగర్: డబ్బుల విషయంలో జరిగిన తగాదాలో మద్యం సేవించిన వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన మహ్మద్ గాలిబ్ ఆటోనగర్‌లో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. గోదావరిఖనికి చెందిన ఫిరోజ్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరూ కలిసి మరో ప్రాంతంలో పనులు చేసి ఇటీవల స్వస్థలాలకు చేరుకున్నారు. పనిచేసిన క్రమంలో వచ్చిన డబ్బుల విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో మద్యం సేవించిన ఫిరోజ్ కత్తితో గాలిబ్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన గాలిబ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి వాఙ్మూలాన్ని మెజిస్ట్రేట్ సమక్షంలో పోలీసులు నమోదు చేశారు. బాధితుని సోదరుడు తాజ్ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ నిందితుడిని అదుపులోకి తీసుకుని కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

• విగ్రహ పునఃప్రతిష్ఠ సమాచారం ఇవ్వలేదని అభ్యంతరం

కమాన్‌పూర్: మండల కేంద్రంలో కూతుల కుంట కట్టపై నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం ఏర్పాట్లు చేసిన అమ్మవారి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పులు కుల సంఘాలకు చెందిన వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కట్టపై నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం విషయంలో గ్రామంలోని అన్ని కులాలకు సమాచారం తెలపలేదని ఆలయం వద్ద పలువురితో వాగ్వాదానికి దిగారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠకు సమాచారం అందలేదని గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు.

• గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి

ముత్తారం: మండలంలోని మచ్చుపేటకు చెందిన దుండె రాజేశం (65) అనే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఇంట్లో ఉన్నప్పుడు ఛాతిలో నొప్పి రావడంతో మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని సింగరేణి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల మహిళా అధ్యక్షురాలు పద్మ ఆనంద్, నాయకులు రాజేశం సంతాపం తెలిపారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలు



జెండా వందనం చేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఏఐటీయూసీ యూనియన్ కార్యాలయంలో గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ గోవర్ధన్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కమాన్‌పూర్ మండల కార్యదర్శి రాజారత్నం, రవీందర్, అన్నారావు, శ్రీనివాస్, ఆంజనేయులు, రామ్మూర్తి పాల్గొన్నారు.

రక్షణ చర్యలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమాండింగ్ ఆఫీసర్ విశ్వాస్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో విపత్కర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టెన్త్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ బబ్లూ విశ్వాస్ మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు ఎలా కాపాడుకోవాలి, మంటలు ఆర్పేందుకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై విద్యార్థులతో మాక్ డ్రిల్ నిర్వహించారు. రామగుండం ఐసీడీఎస్ సీడీపీవో అలేఖ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మీర్జాబేగ్, ఎఫ్‌ఆర్‌వో స్వర్ణలత, మనోచైతన్య ఆర్గనైజర్ పద్మావతి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కల తొలగింపు



సాక్షి స్పందన

ఓదెల: మండలంలోని కొలనూర్ ప్రధాన రహదారికి పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారిందని సాక్షిలో బుధవారం కథనం ప్రచురితమైంది. స్థానిక కార్యదర్శి శ్రీనివాస్ స్పందించి పంచాయతీ సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలను తొలగించారు.

విలీనసభ జయప్రదం చేయండి

రామగుండం: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 28న నిర్వహించే న్యూడెమోక్రసీ పార్టీల విలీనసభను జయప్రదం చేయాలని కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం కూడలిలో అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రతినిధులు గురువారం చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు తిరుపతి, అఫ్జల్, రాజు, రమేశ్, మల్లయ్య, కుమార్ ఉన్నారు.

ఆలయంలో మహా పడిపూజ



పూజల్లో కార్పొరేటర్ కౌశిక లత–హరి దంపతులు

రామగుండం: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో గురువారం రాత్రి మహా పడిపూజ వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కౌశిక లత, కేశోరాం కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరి నేతృత్వంలో జరిగిన పడిపూజలో ప్రముఖ ట్యాక్స్ కన్సల్టెంట్ వొల్లాల సురేశ్‌గుప్తా పాల్గొన్నారు. ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖరశర్మ, గురుస్వాములు గోపగాని రాములుగౌడ్, ఇల్లందుల శ్రీనివాస్, లగిశెట్టి రవికుమార్ తదితరులు ఉత్సవమూర్తికి అభిషేకం చేయించారు.

వాజ్‌పేయ్ సేవలు మరువలేనివి



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు సోమవారపు లావణ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పర్వతాలు మాట్లాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయ్ సేవలు మరువలేనివని కొనియాడారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు మావాది రామన్న, ఎస్సీ జనరల్ సెక్రటరీ కాసిపేట శివాజీ, పెద్దపల్లి రవీందర్, నవీన్‌కుమార్, నరహరి, మంజు, కుమారస్వామి, సతీశ్, అన్వేష్, కేవీ రావు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పల్లకిసేవ



పల్లకిసేవలో స్వాములు, భక్తులు

జ్యోతినగర్: స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ మాలధారణ స్వాములు, భక్తులు పల్లకిసేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం మండల పూజ మహోత్సవంలో భాగంగా అర్చకులు వామనశర్మ ఉదయం గణపతి హోమం, అభిషేకం పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి అయ్యప్ప పల్లకిసేవ నిర్వహించారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనగామ తిరుపతి, సంపత్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మండల పూజ మహోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం శ్రీఅయ్యప్పస్వామి మూలవిరాట్‌కు 108 కలశాలతో ఘనంగా గంధాభిషేకం నిర్వహించారు. ఉదయం ఫల పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, కమిటీ సభ్యులు కండెం సురేశ్, స్టాలిన్‌గౌడ్, చక్రపాణి, వీరారెడ్డి, రౌతు రమేశ్, లింగమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, రాయమల్లు, రాజయ్య, నాగరాజు, కొమురయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛభారత్



శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మండలంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ శతజయంతి సందర్భంగా గురువారం అన్నపూర్ణకాలనీలోని దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంత్‌గౌడ్ మాట్లాడారు. వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడని, అంకితభావంతో పనిచేసిన నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్, సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి, కోమళ్ల మహేశ్, తోట కుమారస్వామి, కొండపర్తి సంజీవ్, కోడూరి రమేశ్, గుండబోయిన భూమయ్య, అంజి, తిరుపతి, నర్సింగ్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రిడ్ ఇండియా మాక్ ఎక్సర్‌సైజ్

జ్యోతినగర్: దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అధిగమించడంపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈనెల 28న గ్రిడ్ ఇండియా మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 11.00 గంటల – మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా విఫలమైన సందర్భంలో మాక్ ఎక్సర్‌సైజ్ దోహదం చేస్తుందని అధికారులు చెప్పన్నారు. ఈక్రమంలోనే రామగుండంలోని ఎన్టీపీసీ జనరేటింగ్ స్టేషన్‌కు స్టార్టప్ విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా హెచ్‌వీడీసీ భద్రావతి–రామగుండం ఇంటర్ రీజినల్ లింక్ పీజీసీఐఎల్, టీజీ ట్రాన్స్‌కో, ఎన్టీపీసీ రామగుండం, కొన్నిప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు. దీన్ని అధిగమించేందుకు కోరుట్ల, మెట్‌పల్లి, మేడిపల్లి ప్రాంతాల్లోని లోడ్‌లకు 30నిమిషాల పాటు కథలాపూర్, రాయికల్, జగిత్యాల రూరల్, కొడిమ్యాల, మల్యాల, వేములవాడ రూరల్, గంగాధర, రామడుగు, చొప్పదండి భాగంతోపాటు నందగిరి ఫీడర్లు ఉన్న జగిత్యాల 220 కేవీ జగిత్యాల సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేస్తారు. మాక్ ఎక్సర్‌సైజ్ విషయంలో సహకరించాలని అధికారులు కోరుతున్నారు.